క్లుప్తంగా

అద్దంకిలో క్షుద్రపూజల కలకలం



క్షుద్రపూజలో చేసిన వస్తువులు

అద్దంకి రూరల్: అద్దంకిలో క్షుద్రపూజల కలకలంరేపాయి. పట్టణ శివారులోని అంబుబాయి దాబా పక్కన ఉన్న సాగర్ కాలువ వెంబడి మూడు రోడ్లు కలిసే చోట అమావాస్య క్షుద్ర పూజలు చేసిన సామగ్రి పసుపు కుంకుమ, నిమ్మకాయలు, గుడ్డు, కొబ్బరి కాయ మంగళవారం రైతులకు కనబడ్డాయి. పంట పొలాలకు వెళ్లే దారిలో ఇలాంటివి ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్నాళ్ల కిందట అద్దంకి నుంచి సింగరకొండపాలెం, కలవకూరు వెళ్లే రోడ్డుల్లో క్షుద్ర పూజలు చేసిన వస్తువు కనబడ్డాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు.

36 యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకుల సుముఖత



ఏపీఎం జ్యోతి ప్రసాద్

జే.పంగులూరు: మండల పరిధిలో పీఎంఈజీపీ, పీఎం ఎఫ్ఎంఈ, డైరీ పథకం ద్వారా మొత్తం 36 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ఆగస్టు మొదటి నాటికి గ్రౌండింగ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని మండల వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం జ్యోతి ప్రసాద్ తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఐకేపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూచన మేరకు గత నెలలో రుణ మేళ ఏర్పాటు చేశామన్నారు. మేళాలలో 14 సచివాలయాల పరిధిలోని 21 గ్రామాలకుగాను పీఎం ఈజీపీ కింద 40, పీఎంఎఫ్ ఈ 15, డైరీ యూనిట్ పథకం కింద 10 అప్లికేషన్లు వచ్చినట్లు తెలిపారు. ఈ అప్లికేషన్లను బ్యాంక్ మేనేజర్ ద్వారా వెరిఫికేషన్ చేయించామన్నారు. మొత్తం 36 అప్లికేషన్లను బ్యాంక్ అధికారులు అంగీకరించారని తెలిపారు. వీటికి 35 శాతం సబ్సిడీ వస్తుందని తెలిపారు. ఏర్పాటు చేసిన యూనిట్‌ను మూడేళ్లపాటు సక్రమంగా నడిపి, నెలవారీ కిస్తీలు సక్రమంగా చెలిస్తే, మూడేళ్ల తరువాత సబ్సిడీ వారి ఖాతాలో జమఅవుతుందని తెలిపారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ మహిళలైతే 35 శాతం సబ్సిడీ, ఓసి పురుషులు అయితే 25 శాతం మాత్రమే సబ్సిడీ వస్తుందని తెలిపారు. అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పాముకాటుకు గురైన వ్యక్తి మృతి



మృతి చెందిన శివానందశర్మ

యద్దనపూడి: పాము కాటుకు గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. యద్దనపూడి గ్రామానికి చెందిన శివానందశర్మ అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేసి వంటగదిలో ఉన్న సింక్ వద్దకు చేయి కడుక్కోవడానికి వెళ్లాడు. ఈక్రమంలో అక్కడ ఉన్న పాము శివానందశర్మను కరిచింది. వెంటనే బంధువులతో కలసి గ్రామంలో ఉన్న ఆర్ఎంపీ వద్దకు వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నాడు. మెరుగైన చికిత్స కోసం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని కుమారుడు బొప్పూడి సాంబశివరావు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే అనూక్ తెలిపారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

బల్లికురవ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం వల్లాపల్లి, కొత్తూరు సచివాలయాల వద్ద నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు టీమ్‌లుగా తాను తహసీల్దార్ రెండు టీమ్‌లుగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆయా సచివాలయాల వద్ద క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండల అధికారులు ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

బంగారం చోరీపై కేసు

అద్దంకి రూరల్: నగల షాపులో బంగారు కమ్మలు దొంగిలించిన ఇద్దరు మహిళలపై చర్యలు తీసుకోవాలని షాపు యజమాని మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. అద్దంకి పట్టణంలోని శ్రీరామబజార్‌లో ఉన్న నగల షాపులో ఈనెల 15వతేదీ మధ్యాహ్నం బంగారపు కమ్మలు కొనేందుకు గుర్తు తెలియని ఇద్దరు మహిళలు వచ్చి వెళ్లారు. వారు వచ్చిన వెళ్లిన తరువాత కమ్మలు తగ్గినట్లుగా అనుమానం రావడంతో రెండు రోజుల సీసీ పుటేజీని పరిశీలించారు. కమ్మలు దొంగిలించినట్లుగా తెలియటంతో మహిళలపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాటివిలువ సుమారు రూ. 20 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

మీ సేవలకు సలాం

వలంటీర్లకు వందనం

- నాలుగేళ్లుగా అలుపెరుగని సేవ
- 50 గృహాల పరిధిలో కుటుంబ సభ్యుడిగా సేవలు

అద్దంకి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వలంటీర్ వ్యవస్థ ఏర్పాటైంది. అప్పటి నుంచి పట్టణ, గ్రామాల పరిధిలో తమకు కేటాయించిన గృహాల్లోని వారికి ప్రభుత్వ పథకాలను అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. గౌరవ వేతనాన్ని తీసుకుంటూ, సేవలు అందుకున్నా వారి ఆశీస్సులతో తృప్తి చెందుతున్నారు వలంటీర్లు. వారి సేవలకు వందనమని సేవలందుకున్న గృహాల లబ్ధిదారులు చెప్తున్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని అంతర్జాతీయ సర్వేలు సైతం చెప్పాయి. గత ప్రభుత్వంలో ఇలాంటి వ్యవస్థ ప్రవేశపెట్టాలనే ఊహే లేదని, ఈ ప్రభుత్వంలో ప్రవేశపెట్టి సేవలు చక్కగా అందుతుంటే బయట ఉండి కొందరు నిందలు వేస్తున్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వైద్యశాలకు వెళ్లి పింఛన్ ఇస్తున్న వలంటీర్ ప్రసన్న

అర్హులకు న్యాయం జరిగింది..



గత ప్రభుత్వం నా పింఛన్‌ను తొలగించింది. ఎన్ని సార్లు నేను అర్హుడని మొరపెట్టుకున్నా మళ్లీ ఇవ్వలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటై వలంటీర్ వచ్చిన తరువాత మా వలంటీరు జీ కోటేశ్వరరావు నాకు అన్నీ తానై పింఛన్ వచ్చేలా చేశాడు. ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్తున్నాడు. రైతు భరోసా వస్తోంది.. కాపు నేస్తం వచ్చింది. వలంటీరు లేకుంటే మాకు తిప్పలు తప్పేవి కావు.

నాగండ్ల పున్నయ్య, ముక్తేశ్వరం

వితంతు పింఛన్ ఇచ్చారు..



నాకు వితంతు పింఛన్ ఇచ్చారు.. కాపు నేస్తం వచ్చింది.. ఇంటి పట్టా ఇచ్చారు. ఎవ్వరి చుట్టూ తిరిగే పని లేకుండానే అన్నీ మా వలంటీరు రెహానా చేసి పెడుతుంది. రూపాయి తీసుకోకుండా ఈ సేవలు గతంలో అందేవి కావు. ఎవరో ఒక నాయకుడు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పనులు అయ్యేవి కాదు. అర్హులమైనా ప్రభుత్వ పథకం అందేది కాదు. ఈప్రభుత్వంలో జగనన్న చేసిన సేవలకు కృతజ్ఞతలు.

పీ కామాక్షమ్మ, మేదరమెట్ల

అన్ని పథకాలు వచ్చాయి..



నా పేరు బీ విజయ దుర్గ. మాది రెడ్డిపాలెం గ్రామం అద్దంకి మండలం. నాకు వితంతు పింఛన్ వస్తోంది. ఒక పిల్లాడికి అమ్మఒడి వస్తుంది. ప్రత్యేకావసరాల పిల్లకు దివ్యాంగ పింఛన్ వస్తుంది. వైఎస్సార్ ఆసరా వస్తోంది. ఏమి తెలియకున్నా అన్నీ వలంటీరే చెబుతున్నాడు. కాగితాలు పూర్తి చేసి పెట్టి సచివాలయంలోనూ వాళ్లే ఇస్తున్నారు. పథకం ఇంటికి చేరుతోంది. వలంటీర్ గనుక లేకపోయింటే ఎన్ని కష్టాలు పడేవాళ్లమో.

విజయదుర్గ, రెడ్డిపాలెం

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

- జగనన్న సురక్షలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం
- వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల టౌన్: సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఈపురుపాలెం సచివాలయం-3,4 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నీ సామాజిక వర్గాలు ఆర్థికాభివృద్ధి సాధించడంతో పాటుగా రాష్ట్ర ప్రజల సంక్షేమానికి నిరంతరం సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో గ్రామ పంచాయతీలకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా వివిధ ధ్రువీకరణ పత్రాల మంజూరులో జిల్లాలో చీరాల చీరాల మూడో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. అధికారులు, ప్రజలకు అంకితభావంతో పనిచేస్తే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం 2276 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గెల్లి హరిబాబు కుమార్తెకు రూ.5 లక్షల బీమా చెక్కును వెంకటేష్ అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి సత్తార్, జెడ్పీటీసీ ఆకురాతి పద్మినీ, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, తహశీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు, ఏపీఎం సుబ్బారావు, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి, ఈవోఆర్డీ మురళీబాపూజీ, నాయకులు బిట్రా శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, ఎస్.కోటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ బుర్ల సాంబశివరావు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం..

అద్దంకి రూరల్/మేదరమెట్ల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జీవీ సుబారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మణికేశ్వరం గ్రామంలోని సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మణికేశ్వరంలో సర్టిఫికెట్ అందజేస్తున్న తహశీల్దార్

➤ కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, కుర్రవానిపాలెం సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని మేదరమెట్లలో 1031, కుర్రవానిపాలెంలో 548 మొత్తం 1579 పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, సర్పంచ్‌లు బొనిగల ఎలీశమ్మ, నాదెండ్ల దశరథరామయ్య, ఈవో శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి..

చినగంజాం: ప్రభుత్వం ప్రజలకందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇంకొల్లు మండల ప్రత్యేకాధికారి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పూసపాడు, ఇడుపులపాడు-2 సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో 841 లబ్ధిదారులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, ఈఓ శేషగిరిరావు, ఏపీఎం మోహనరావు, ఎంపీటీసీ రావి రత్తమ్మ, జేసీఎస్ కన్వీనర్ షేక్ మస్తాన్ వలి, పూసపాడులో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఈఓఆర్డీ ఏ శ్రీనివాసరావు, సర్పంచ్ పీ రమాదేవి, ఎంపీటీసీ కే శ్రీలక్ష్మి, పీ రాంబాబు, శీనయ్య, ఏ సుబ్బారావు, బీ సతీష్, డీటీ, వైస్ సర్పంచ్ పాల్గొన్నారు.

➤ చినగంజాం మండలంలోని పెదగంజాం-1,2 సచివాలయాల పరిధిలో 720 మంది లబ్ధిదారులకు మండల ప్రత్యేకాధికారి సీహెచ్ హనుమంతరావు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీ పార్వతి, ఎంపీడీవో కే స్వరూపరాణి, సర్పంచ్ నక్కల కృష్ణ, ఎంపీటీసీ ఎం తిరుపతిరావు, ఏపీఎం అంజిబాబు గ్రామ పెద్దలు, వలంటీర్లు పాల్గొన్నారు.



పెదగంజాంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు



ఇడుపులపాడులో లబ్ధిదారుడికి ధ్రువీకరణ పత్రం ఇస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మేదరమెట్లలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి

ఉప ముఖ్యమంత్రిని కలిసిన కృష్ణచైతన్య



అద్దంకి రూరల్: బాపట్ల జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతిని మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు ఆరోగ్య భరోసా



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ

చీరాల: పేదలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం గొప్పవరమని ప్రముఖ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ గవిని లక్ష్మీనారాయణ, కామాక్షి హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్ అన్నారు. మంగళవారం కామాక్షి హాస్పిటల్ డాక్టర్ వైస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఉచిత హెర్నియా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈశిబిరంలో డాక్టర్ 53 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు ఉచితంగా చేస్తారన్నారు. ఇంట్లో విశ్రాంతి తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతంగా తయారయ్యేందుకు భరోసా సాయాన్ని రోజుకు రూ.225 చొప్పున అందిస్తుందన్నారు. శిబిరంలో ఎముకల వైద్యులు చైతన్య చౌదరి, ఆరోగ్యశ్రీ మిత్రలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఈ

చీరాల రూరల్: అర్హత కలిగిన ప్రతి ఒక్క రైతుకు సంక్షేమ పథకాలను అందించేలా కృషి చేయాలని చీరాల ఏడీఏ బీ ఎఫ్రాయిమ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక వ్యవసాయధికారి కార్యాలయంలో చైర్‌పర్సన్ కావూరి రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల బోర్డు సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించే అన్ని పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వారికి అవగాహన కల్పించి, వారికి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట విత్తనాలను కూడా రాయితీపై అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ పవన్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ సంధ్య, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంప్‌నకు ఐదుగురు ఎంపిక



ప్రత్యేక క్యాంప్‌నకు ఎంపికైన విద్యార్థులతో అధికారులు

వేటపాలెం: కాకినాడలో జరగనున్న ఎన్‌సీసీ ప్రత్యేక క్యాంప్‌నకు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐదుగురు ఎంపికైనట్లు హెచ్ఎం గుమ్మా శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో జరిగిన ఎన్‌సీసీ క్యాంప్‌లో వీరు ఎంపికైనట్లు చెప్పారు. 24న కాకినాడలో 9వ తరగతి చదువుతున్న ఇండ్ల రిషికా, పొందుగల రుచితాపాల్, తన్నీరు అభిషేక్, డేటా మహేష్, డేటా ప్రజ్వాల్ పాల్గొంటారన్నారు. ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్, జేసీఓ సుబేదార్ బల్‌జీర్ సింగ్, ఎన్‌సీసీ అధికారి జి. సుమన్ తదితరులు అభినందించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



మద్యం తాగుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పర్చూరు (చినగంజాం): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని పర్చూరు ఎస్సై ఎన్ చెంచు ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం జాగర్లమూడి రహదారిలో బహిరంగంగా మద్యం తాగుతున్న ఇద్దరిని ఎస్సై అదుపులోనికి తీసుకున్నారు. గత పది రోజుల వ్యవధిలో బహిరంగంగా మద్యం తాగుతున్న 20 మందిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచినట్లు ఆయన తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్ల పక్కన మద్యం సేవించకూడదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వంకాయలపాడులో వైద్యశిబిరం

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని వంకాయలపాడు గ్రామ పంచాయతీలో 20వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు గుంటూరు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవాకం ఒక ప్రటనలో తెలిపారు. నిడమానూరి బ్రహ్మం కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరంలో గుండె, మెదడు, నరాలు, వెన్నెముక సంబంధించిన వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని వంకాయలపాడుతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులు స్వల్పం



నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

చీరాల టౌన్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించడం వలన రైతులకు ఖర్చు తగ్గడంతో పాటుగా ఆదాయం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ పీఆర్పీలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గవినివారిపాలెం పంచాయతీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా బీరకాయ, దోస కాయ పంటలు సాగుచేస్తున్న బెనిన్ అనే రైతు పొలాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పరిశీలించి పలు సూచనలు అందించారు. దోసకాయ, బీరకాయ పంటలో పచ్చ పురుగు వలన పంట దెబ్బతినడంతో ప్రకృతి వ్యవసాయ ద్ధతిలో పచ్చ పురుగు నివారణకు నీమాస్త్రం తయారుచేసి పిచికారీ చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సాగు చేస్తే సాగుఖర్చులు తగ్గడంతో పాటుగా పోషకాహార ఉత్పత్తులు పండించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శిరీష, కవిత, పద్మజ, నిర్మల, స్వరూప ఉన్నారు.

సమగ్ర ఓటర్ల జాబితా అందజేయాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వెంకట నారాయణ

పర్చూరు (చినగంజాం): ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించిన సమగ్ర నివేదికను బూత్‌స్థాయి అధికారులు అందించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకట నారాయణ ఆదేశించారు. ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీలోపు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించాలన్నారు. అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో పర్చూరు తహసీల్దార్ కే సంధ్యశ్రీ, మార్టూరు తహసీల్దార్ సురేష్ బాబు, యద్దనపూడి తహసీల్దార్ వెంకటరెడ్డి, ఇంకొల్లు తహసీల్దార్ బ్రహ్మయ్య, చినగంజాం తహసీల్దార్ పార్వతి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

నేడు ఎంజీసీ మార్కెట్‌కు సెలవు

చీరాల అర్బన్: ది టెక్స్‌టైల్ మర్చంట్స్ అసోసియేషన్ కమిటి కార్యదర్శిగా, మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ నిర్మాణ కమిటీలో జాయింట్ సెక్రటరీగా పనిచేసిన వేముల భరత్‌కుమార్ మంగళవారం తెల్లవారుజామున మరణించారు. ఆయన మృతికి సంతాపంగా బుధవారం సంతాప సభ నిర్వహించి అనంతరం మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్లు టెక్స్‌టైల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శీరాం వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బల్లికురవ: ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందించే పథకాలు, రాయితీలను కౌలు రైతులకు వర్తింపచేసేందుకు గుర్తింపు కార్డులను తక్షణమే అందించాలని తహసీల్దార్ కె. రవిబాబు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో 20 ఆర్‌బీకెలోని వీఏఏలు, వీఆర్‌వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 818 మందికి గుర్తింపు కార్డులు అందించారని ఇంకా 725 మందికి కార్డులు ఇవ్వాల్సి ఉందని రెండు రోజుల్లోపు అందించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయాధికారి ఎస్‌పీపి కుమారి పాల్గొని మాట్లాడారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం అధిక శ్రావణ మాసం, ఆశ్లేష నక్షత్రం, విదియ తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.